క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): మండలంలోని కె.పొన్నవరం, వెంకటాపురం గ్రామాల్లో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన మురుగు నీటి కాలువలను మంగళవారం ఎంపీడీఓ జి.శ్రీను ఎంపీపీ మార్కపూడి గాంధీతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూచి నర్సయ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక ఫలసాయం



కంచికచర్ల: సేంద్రియ ఎరువుల వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక ఫలసాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. నీటి యాజమాన్య పద్ధతులు చేపట్టటం, వరి పొలాల్లో ఎలుకల నివారణ గురించి అవగాహన కల్పించారు. రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్, ట్రాక్టర్ పరికరాలు అందజేస్తామన్నారు. పంట నమోదు ఆవశ్యకత, నేల సంరక్షణ తదితర వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు హనీష్, రైతులు పాల్గొన్నారు.

బాధిత మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలెంలోని తిరుమలగిరి రోడ్‌లో ఉన్న సాయి తిరుమల కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో బాధిత మిర్చి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరు శివాజీ డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పార్టీ రైతువిభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరు శివాజీ, పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ పరిశీలించారు. అక్కడ ఉన్న మిర్చి రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ప్రమాద ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపాలని, నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో భవిష్యత్తులో ధరలు పెరుగుతాయనే ఆశతో రైతులు తమ పంటను కోల్డ్ స్టోరేజీలో దాచుకున్నారని, ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు రూ.4 కోట్ల మేరకు రైతులకు నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరగాలని, లేని పక్షంలో వారికి అండగా నిలబడి వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో మెడికల్ షాపుల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల విషయం తెలుసుకున్న కొన్ని మెడికల్ షాపుల యజమానులు ముందుగానే తమ షాపులను మూసివేశారు. అధికారులు గణేష్ మెడికల్ షాపు, శ్రీవెంకటేశ్వర మెడికల్ ఏజెన్సీ, ప్రశాంతి మెడికల్స్ తదితర షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. రికార్డులు, నిషేధించిన మందులు అమ్ముతున్నారా అని పరిశీలించారు. ముఖ్యంగా మత్తుకు సంబంధించిన మందులు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. కొన్ని షాపుల్లో నిషేధిత మందులను గుర్తించారని, వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

తిరువూరు: ఎ.కొండూరు మండలం గోపాలపురం నుంచి అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎ.కొండూరు ఎస్‌ఐ చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రావెల్ తోలకాలు నిర్వహిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకుకుని మట్టి తోలకాలు నిర్వహిస్తున్న గోపాలపురం సర్పంచి కోలా శ్రీనుతో పాటు టిప్పర్ల డ్రైవర్లు బత్తుల శ్రీనివాస్, వేముల కొండ శ్రీనివాస్, మాలావత్ కిశోర్‌లపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేశారు.

పనిభారంతో పంచాయతీ కార్యదర్శులు

- సర్వేలతో నిత్యం సతమతం
- పని ఒత్తిడి తగ్గించాలంటూ వేడుకోలు
- గతంలో 200 రకాల సేవలు అందించే వారు
- ప్రస్తుతం కేవలం సర్వేలకే పరిమితం



పెనుగంచిప్రోలు ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)

పెనుగంచిప్రోలు: సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సర్వేలతో నానా పాట్లు పడుతున్నామని వాపోతున్నారు. విధుల భారం తగ్గించి, తమ ఆరోగ్యాలు కాపాడాలని ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

మండల పరిషత్ కార్యాలయాల్లో కార్యదర్శులకు ఇటీవల కాలంలో పనిభారం విపరీతంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పదుల సంఖ్యలో అప్పగించిన సర్వేలు కార్యదర్శులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కూటమి ప్రభుత్వంలో సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు సర్వే ఉద్యోగులుగా మారిపోయారు. గతంలో సచివాలయాల్లో కార్యదర్శులు 200కు పైగా వివిధ రకాల సేవలు అందించేవారు. అయితే నేడు వారు కేవలం సర్వేలకే పరిమితమై పోతున్నారు. నిత్యం ఇంటింటికీ వెళ్లి ఏదో ఒక సర్వే చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. పనిభారం పెరిగిపోతోందని ఎన్నిమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఉదయం 6 గంటలకు యాప్స్ తెరచి హాజరు నమోదు చేయటంతో మొదలయ్యే సర్వే నిర్ణీత లక్ష్యం చేరుకునే వరకు సమయంతో పని లేకుండా సర్వేల్లో నిమగ్నమై పోతున్నారు. ఈ సర్వేలే కాకుండా రోజువారీ విధులు, సోమవారం గ్రీవెన్స్ మరోవైపు ఉన్నతాధికారుల జూమ్ మీటింగులు, ఫోన్ కాన్ఫరెన్స్‌లతో క్షణం తీరిక లేకుండా పోతోంది.

కార్యదర్శులు నిర్వహిస్తున్న సర్వేలు...

మిస్సింగ్ సిటిజన్, మిస్సింగ్ ఎంప్లాయిస్, వర్క్ ఫ్రమ్ హోమ్, హౌస్‌హోల్డ్స్ జియో ట్యాగింగ్ సర్వే, పీ4 సర్వే, డెత్ రీవెరిఫికేషన్ సర్వే, పీఏసీఎస్ సర్వే, తోలు కళాకారుల సర్వే, ఎన్‌పీసీఎల్ సర్వే, 0–6 పిల్లల మిస్సింగ్ ఆధార్ సర్వే, నాన్ ఏపీ రెసిడెంట్స్ సర్వే, విలేజ్ అస్సెట్స్ సర్వే, విలేజ్ ప్రొఫైల్ సర్వే

పెనుగంచిప్రోలు మండలంలో కార్యదర్శుల సమస్యలు...

- మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం ఏడుగురు కార్యదర్శులు మాత్రమే పని చేస్తున్నారు.
- ఒక కార్యదర్శి పరిధిలో రెండు లేదా మూడు సచివాలయాలు ఉన్నాయి. సిబ్బంది కొరత ఉంది.
- ఒక పంచాయతీకి ఒక కార్యదర్శి ఉంటే పనులు వేగంగా జరుగుతాయి.

గ్రామ పంచాయతీ పరంగా నిర్వహించాల్సిన ముఖ్య విధులు..

ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లు, లైసెన్స్‌ల వసూళ్లు, లీజ్ వసూళ్లు, వేలం పాటలు, ఇతర పన్నేతర వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ, క్లాప్ మిత్రలతో పని చేయించటం, వర్మీ కంపోస్టు తయారీ, వాటర్ ట్యాంక్‌ల క్లీనింగ్, క్లోరినేషన్, ఐవీఆర్ఎస్ కాల్స్, ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు, ఆడ్వర్స్ న్యూస్‌కు ప్రతిస్పందన, గ్రామాల్లో భూముల సర్వే, వివిధ సర్టిఫికెట్లు జారీ, గ్రామ పంచాయతీ, గ్రామసభ మీటింగ్స్, పంచాయతీ రికార్డుల అప్‌డేట్ వంటి విధులు ఉన్నాయి.

గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

నందిగామరూరల్: విద్యార్థినులు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. పట్టణ శివారు అనాసాగరం మండల పరిషత్ పాఠశాలలో భేటీ బచావో.. భేటీ పడావో.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాలల చట్టాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు స్పర్శలో తేడాలను గుర్తించాలని, ఎవరైనా తాకరాని చోట తాకుతుంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవటం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే అనారోగ్య సమస్యల బారి నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాబీ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

నందిగామటౌన్: వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీరు, వాడుక నీటికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని ఆరవ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు పంపును కూటమి నాయకులతో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఏచూరు రాము, లక్ష్మీనారాయణ, ఇమామ్ జానీ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పారని మురుగు... భరించలేని కంపు



కంచికచర్ల మోడల్ కాలనీ ఎంపీపీ స్కూల్ సమీపంలో పారుదల కాని మురుగునీరు



కంచికచర్ల పశువుల ఆసుపత్రి రోడ్డులో నిల్వ ఉన్న మురుగునీరు



కంచికచర్ల జమ్మిచెట్టు సెంటర్‌లో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీరు

విద్య, వ్యాపారం, వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న కంచికచర్ల పట్టణ ప్రాంతం నేడు పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో మురికికూపంలా తయారైంది. డ్రైనేజీల్లో మురుగు పారక తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మోడల్‌కాలనీ, అరుంధతీనగర్, ఇందిరాకాలనీ, వసంతకాలనీ, హనుమాన్‌పేట, పెట్రోలు బంక్ సెంటర్, జమ్మిచెట్టు చెంటర్, పశువుల ఆసుపత్రి రోడ్డు పక్కన డ్రైనేజీల్లో పారుదల కాని మురుగునీరు దర్శనమిస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని తొలగించి మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – కంచికచర్ల

వెలగని లైట్లు.. ప్రయాణికుల అవస్థలు



లైట్లు వెలగకపోవటంతో చీకటిలో ఉన్న సర్వీస్ రోడ్డు, హైవే

నందిగామరూరల్: నందిగామ పట్టణంలోని అనాసాగరం నుంచి అంబారుపేట బైపాస్ వై జంక్షన్ వరకు 65వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు గడిచిన వారం, పది రోజులుగా వెలగకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విజయవాడ నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ, ప్రైవేట్‌కు చెందిన కొన్ని బస్సులు నందిగామలోకి రాకుండా హైవే పైనే వెళ్తుంటాయి. ఆ బస్సులకు టికెట్లు రిజర్వ్ చేయించుకున్న ప్రయాణికులు అంబారుపేట వై జంక్షన్, అనాసాగరం వద్ద వేచి ఉంటారు. లైట్లు వెలగకపోవటంతో బస్సుల కోసం చిమ్మ చీకటిలో అర్ధరాత్రి సమయాలలో వేచి ఉండేందుకు ఇబ్బందిగా ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నారు. అంతే కాకుండా రహదారి పక్కనే పంట పొలాలు కూడా ఉండటంతో విష పురుగుల భయం కూడా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల అధికారులు స్పందించి విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

ఏకమొత్తంగా పన్నులు చెల్లించిన వారికి వడ్డీ రాయితీ



విలేకరుల సమావేశంలో కమిషనర్ రమణబాబు

నందిగామ టౌన్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్నును ఈ నెలాఖరులోగా ఏకమొత్తంగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలను ఈ నెలాఖరులోగా ఏకమొత్తంగా చెల్లించిన వారికి ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తామన్నారు. ఇప్పటికే వడ్డీతో ఏకమొత్తంగా పన్ను చెల్లించిన బకాయిదారులకు వారు చెల్లించిన వడ్డీని 2025–26 ఆర్థిక సంవత్సరం డిమాండ్‌పై సర్దుబాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సెలవులలో కూడా పురపాలక సంఘ కార్యాలయంలోని పురసేవ కౌంటర్‌లో అన్ని రకాల పన్నులు కట్టించుకుంటారని చెప్పారు. ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కౌంటర్ తెరిచి ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుల సంక్షేమమే ఎంప్లాయిస్ సంఘ్ ధ్యేయం

ఎస్సీఆర్ఈఎస్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్



అతిథులను సత్కరిస్తున్న రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బ్రాంచి నాయకులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎన్ఎఫ్ఐఆర్, ఎస్‌సీఆర్ ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదం సంతోష్ కుమార్ అన్నారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపులో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజినల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్మికుల పెన్షన్ విధానంలో యూపీఎస్‌ని ఓపీఎస్‌గా మార్చేందుకు ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. రైల్వేల ప్రైవేటీకరణను నిలిపివేసి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, 18 నెలల కరువు భత్యం విడుదల చేయాలని ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అరుణ్ కుమార్ కోరారు. అతిథులను దుశ్శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. డివిజినల్ అధ్యక్షుడు బి.బాబూనాయక్, బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్, డెప్యూటీ డివిజినల్ కార్యదర్శి ఎస్ఎం ఇనాయత్ పాషా, సీడబ్ల్యూసీ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

వీరులపాడు: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో అరుంధతీ దేవి అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో మంగళవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా నడుచుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు మంద పిచ్చియ్య

వత్సవాయి: దళితులపై దాడిచేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంద పిచ్చియ్య మంగళవారం డిమాండ్ చేశారు. వత్సవాయమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా గ్రామానికి చెందిన రాయల మధుకు మరొక సామాజికవర్గం వారికి గొడవ జరిగింది. అప్పటికి తాత్కాలికంగా గొడవ సద్దుమణగగా తరువాత మధు ఇంటి పైకి వెళ్లి కొందరు యువకులు కర్రలతో దాడికి దిగారు. ఈ ఘటనకు సంబంధించి అన్ని ఆధారాలను సీసీ ఫుటేజీతో సహా ఎస్ఐకు అందించామని చెప్పారు. ఈ నెల 17 న ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు పోలీసులు ఎటువంటి విచారణ నిర్వహించలేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దాడిచేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి దావీదు, నాయకులు ఏసుపోగు రవి, మార్కపూడి బాబురావు, రాయల పుల్లయ్య, ఏసుపాదం, రాయల మురళి, సందీప్, గోపి, గణేష్, రాఘవులు, తిరుపతిరావు, గురునాథం, అమర్నాథ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అవినాష్, స్వామిదాసు తదితరులు

తిరువూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు ఎల్లవేళలా అండగా నిలబడిందని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా తిరువూరులో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందులో అవినాష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారని చెప్పారు. జామియా మసీదులో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం లైన్ బజార్‌లో వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం నిర్వహించిన ఇఫ్తార్ విందులో అవినాష్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, తాళ్లూరి నవీన్‌కుమార్, తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కలకొండ రవికుమార్, యరమల రామచంద్రారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఖిజర్ అలీ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు చట్టం తీసుకురావాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి కౌలు చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రోహిత్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం పంపించాలని కోరారు. జమలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులను గుర్తించి నూతన కౌలుచట్టం తీసుకొస్తామని వాగ్దానం చేసి పది నెలలు గడచినా ఇంతవరకు కౌలుచట్టం తీసుకు రాలేదన్నారు. భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు బుడ్డి రమేష్, ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ వాసు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ కోరారు. కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నగర కళాకారుల ఆత్మీయ సమావేశం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగాయి. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, బి.వి.వీరభద్రరావు, ప్రిన్స్, డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, అమ్ముల ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

మైలవరం: బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవస్థానంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి తేజ తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్య వరప్రసాద్, దేవదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందన్నారు. పాల్గొనే వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సవరణ

ది. 22-2-2025న వేసిన సాక్షి దినపత్రిక నందిగామ డివిజన్‌లో ప్రచురించిన ... జగ్గయ్యపేట బ్రాంచి ... రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ

2013 భూసేకరణ చట్టం అమలుచేయాలి



సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది రవికుమార్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు, 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని హైకోర్టు న్యాయవాది సీహెచ్ రవికుమార్ డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం గుంటూరు బాపనయ్య 47 వర్ధంతి సందర్భంగా 'భూ సమస్య ప్రాధాన్యత – ప్రభుత్వ విధానాలు, పరిష్కార మార్గాలు, రాష్ట్ర ప్రభుత్వ విజన్ – 2047, పేద ప్రజలపై ప్రభావం' అంశాలపై రాష్ట్ర సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. భూస్వాములు, జమీందారులకు వ్యతిరేకంగా పేదల హక్కుల కోసం పోరాడిన నాయకుడు గుంటూరు బాపనయ్య అని కొనియాడారు. పేదల హక్కులను కాలరాస్తూ మిగులు భూములు, అటవీ, పోరంబోకు భూములను సీఎం చంద్రబాబు అదాని వంటి కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 4పీ విధానం తీసుకొచ్చి పేదలపై భారాలు మోపే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వి.శివనాగరాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మైలవరం: రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామ శివారు రెడ్డికుంట వద్ద ఆర్ అండ్ బీ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన రాయల ప్రసాద్, నాగలక్ష్మీ దంపతులు తమ రెండేళ్ల కుమారుడు లక్కితో కలిసి ఓబులాపురం నుంచి తాడిగూడెం మీదుగా విస్సన్నపేట బయలుదేరారు. అదే రహదారిలో రెడ్డిగూడెం నుంచి బూరుగగూడెం వెళ్లేందుకు చాట్ల వివేక్, వల్లూరి గణేష్ తమ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను తప్పించే క్రమంలో రాయల ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లక్కీతో పాటు వివేక్, గణేష్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీదారుల అరెస్ట్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లో మంగళవారం సారా తయారీదారులను అరెస్టు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. ఎ.కొండూరు మండలం కేశ్యా తండాలో భరోతు పార్వతి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, అదే తండాలో సారా విక్రయించే భరోతు హరిబాబుపై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు.